క్లుప్తంగా

మంగళహారతులతో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

మామడ: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహిళలు మంగళహారతులతో తరలివచ్చారు. అర్చకులు రామచంద్రచార్యులు భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

నేడు ఆయుర్వేద వైద్యశిబిరం

నిర్మల్: సారంగపూర్ మండలం చించోలి(బి)లో ఆదివారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయుర్వేద వైద్యురాలు దేవర సౌమ్య ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'


మాట్లాడుతున్న అధ్యక్షుడు భోజన్న

కుంటాల: ఐకేపీలో పని చేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం కుంటాల సమైక్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇచ్చి.. రూ.10 లక్షల బీమా వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ మహేశ్, జిల్లా కమిటీ సభ్యులు ముత్యం, స్వప్న, లావణ్య, భోజన్న పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

ఖానాపూర్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌సీఈఆర్టీ, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ తొమ్మిదో తరగతి విద్యార్థిని గడ్డి సంజన ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై జీవన్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లూరు–కుంటాల రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ వాహనపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత, ప్రశాంతత

ముధోల్: ధ్యానం చేస్తే ఏకాగ్రత పెరిగి ప్రశాంతంగా ఉంటామని ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం హార్ట్‌ఫుల్ వెల్‌నెస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కళాశాలలో మెడిటేషన్ (ధ్యానం)పై కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మెడిటేషన్ ట్రైనర్ షరీఫ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీకాంత్, హుస్సేన్, అధ్యాపకులు తదితరులున్నారు.

ముగ్గుల పోటీలు


పోటీల్లో విద్యార్థినులు, తల్లిదండ్రులు

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు తెలిపేందుకే ఈ ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రాధ, మంగమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న సివిల్ జడ్జి అజయ్‌కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయవాద పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి న్యాయవాద పరిషత్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాద పరిషత్ రాష్ట్ర కోశాధికారి మంగునాయక్, కార్యదర్శి షేర్ నరేందర్, ఉపాధ్యక్షుడు నూనె గంగాధర్, కొమ్మోజి రమణ, వినోద్‌కుమార్, సుంకరి రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మా ప్రాణాలు పట్టించుకోరూ..!

- పట్టణంలోని భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై పట్టణానికే చెందిన ఓ యువకుడు ఇటీవల బైక్‌పై వెళ్తుండగా.. గుంతలను తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.
- ఇదే రహదారిపై పట్టణానికే చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా.. అదేరోజు రాత్రి చీకట్లో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.


తారు లేచి గుంతలతో కనిపిస్తున్న జాతీయ రహదారి

- భైంసాలో జాతీయ రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు
- గుంతలరోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


వంగిపోయిన వేగ నియంత్రణ సూచిక


రహదారి పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం

భైంసాటౌన్: మన దేశంలో రోగాల బారిన పడి చనిపోయే వారి కన్నా.. రోడ్డు ప్రమాదాల మరణించే వారి సంఖ్యే ఎక్కువ. అతివేగం, నిబంధనలు పాటించకపోవడంతోపాటు అసంపూర్తి రోడ్లు కూడా పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

పట్టణంలోని భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై పలువురు రోడ్డు ప్రమాదాల బారిన ప్రాణాలు కోల్పోతుండగా, మరెందరో తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. రహదారి నిర్వహణ సక్రమంగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు చోట్ల రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీనికితోడు అడుగడుగునా తారు లేచి గుంతలతో అధ్వానంగా మారింది. మరికొన్ని చోట్ల కల్వర్టులకు ప్రహరీ లేకపోవడంతో వాహనదారులు కిందపడుతున్నారు. పట్టణంలో ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది.

ఇష్టానుసారం యూటర్న్‌లు.. .

పట్టణంలో స్థానిక భోకర్ చౌరస్తా నుంచి నిర్మల్ రోడ్డులో పార్డి(బి)బైపాస్ వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. కొన్నిచోట్ల డివైడర్ల వద్ద ఇష్టారీతిన యూటర్న్‌లు ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్టీసీ డిపో యూటర్న్ వద్ద గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎంఎస్ పెట్రోల్‌బంక్ వద్ద, ఖద్దా హోటల్ సమీపంలో, ఫైర్ స్టేషన్, పిప్రి కాలనీకి వెళ్లే మార్గం.. ఇలా పలుచోట్ల యూటర్న్‌లు ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. నిర్మల్ చౌరస్తా వద్ద సైతం ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. హైవేపై వేగంగా వచ్చే వాహనాలు యూటర్న్‌ల వద్ద వచ్చే వాహనాలను గమనించక ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. అలాగే డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ కోసం రోడ్డుపై అడ్డంగా తవ్విన గుంతలు సక్రమంగా పూడ్చకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సాత్‌పూల్ వంతెనపై రోడ్డుపై పెద్ద గుంతలు ఇబ్బందిగా మారాయి.

నిర్వహణ చేపట్టాలి

జాతీయ రహదారిపై పలు చోట్ల వంతెనలకు మరమ్మతులు, కొన్నిచోట్ల పిచ్చిమొక్కల తొలగింపు, సైడ్ బారికేడింగ్ పనులు చేస్తున్నారు. కానీ పట్టణంలో రహదారిపై ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు సరిచేయాలి. అలాగే రోడ్డుపై తారు లేచి ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలి. యూటర్న్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి. అవసరమైన చోట కల్వర్టులకు ప్రహరీలు నిర్మించడంతోపాటు రహదారి విస్తరణ స్పష్టంగా ఉండేలా మార్కింగ్, రోడ్డు పక్కన ఆక్రమణలు లేకుండా చూడాలని, తద్వారా ప్రమాదాలను కొద్దిమేర నివారించవచ్చని వాహనదారులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా రైతువేదిక


మరుగుదొడ్డిలో సీసాలు, చెత్తాచెదారం


ఆవరణలో వ్యర్థాలు


ధ్వంసమైన మరుగుదొడ్డి తలుపులు

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామ రైతువేదిక మందుబాబులకు అడ్డాగా నిలుస్తోంది. ఆవరణలో తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్డి తలుపులు పగులగొట్టారు.. మద్యం సీసాల ముక్కలను ఇష్టానుసారంగా పడేశారు. గత ప్రభుత్వం హయాంలో రూ.25 లక్షలతో నిర్మించిన రైతువేదిక.. నిర్వహణ లోపంతో ఇలా అధ్వానంగా తయారైంది. అధికారులు సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటా

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు చేసిన పోరాటంతోనే నిబంధనలు సడలించి రైతుల నుంచి సోయా, పత్తి, జొన్న పంటలను అధిక మొత్తంలో కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ప్రాణహిత–చేవెళ్ల కాల్వ పనులను పూర్తి చేసి.. ఎంపీ నగేశ్ చొరవతో దొనెల్లిలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, పిప్పర వెంగల్‌రావు, సుదర్శన్ పటేల్, రమేశ్‌గౌడ్, సుధాకర్, రమణారావు, శరత్‌గౌడ్, గజేందర్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, సారంగపూర్, ఎలగడప గ్రామాల సమీపంలో పురాతన శ్రీఅక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా అత్కాపురం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మార్కపు లక్ష్మణ్, 30 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు వంశీ, శ్రీనివాస్, గ్రామస్తులు జగ్గరావు, రాజా రమేశ్, కోల శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్, నర్సయ్య, గంగాధర్, రాజు తదితరులున్నారు.

'మాస్టిన్ కులాన్ని ఎస్సీ–ఏలో చేర్చాలి'

కడెం: ఎస్సీ వర్గీకరణలో మాస్టిన్(మాస్తీ) కులాన్ని ఎస్సీ–ఏ జాబితాలో చేర్చాలని మాస్టిన్ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న ఆశన్న, ఉపాధ్యక్షులు సాయన్న, ఉషన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మాస్టిన్ కుల ధ్రువీకరణ పత్రం ఆర్డీవో ద్వారా కాకుండా.. తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని కోరారు. వెనుకబడి ఉన్న మాస్టిన్ కులానికి ప్రాధాన్యం ఇవ్వాలని.. ఈనెల 3న ఆదిలాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ సమావేశంలో ఏకసభ్య కమిషన్ సభ్యులను కలిసి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ జీవన్‌రావు సోదరుడు సుదర్శన్ రావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి.. శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ చిన్న రామయ్య, రాంపూర్ మాజీ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, నడిపోల్ల రవి, ధర్మాజీ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో గుడిసె రాజేందర్ తల్లి, మాజీ జెడ్పీటీసీ నారాగౌడ్ కుమారుడు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజేందర్, రాజేశ్వర్, గణేశ్, అర్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ పరామర్శ..

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన దేవారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి శనివారం బాధిత కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. పార్టీ తరఫున అండగా నిలబడతామని.. అధైర్యపడొద్దని బాధితులకు సూచించారు. కరిపె విలాస్, తిరుమలచారి, రాంరెడ్డి, రాజారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టోర్నీని జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 10 నుంచి నిర్వహించే సీజన్–3 కేపీఎల్ క్రికెట్ టోర్నీని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం టోర్నీ నిర్వాహకులు చైర్మన్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. యువత క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను చైర్మన్ అభినందించారు.

శబరిమలై బయలుదేరిన స్వాములు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామం నుంచి అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలై బయలుదేరి వెళ్లారు. పెంట దత్తాద్రి, బద్దం నర్సారెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం వద్ద ఇరుముళ్లు కట్టుకున్నారు. ఇరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

హమాలీల వంటావార్పు


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సారంగపూర్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఎదుట హమాలీ, చాటావాలా కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగు రోజులుగా కొనసాగుతోంది. శనివారం వంటావార్పు చేపట్టి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులు రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ, చాటావాల కార్మికులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల సీపీడీసీ కార్యవర్గం ఎన్నిక

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీపీడీసీ (కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సీపీడీసీ అధ్యక్షుడిగా డాక్టర్ నాగేశ్, ఉపాధ్యక్షులుగా అడ్వకేట్ మాధవి, మొసిన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా బాజీరావు పటేల్, కోశాధికారిగా సంపత్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా నిఖిల్‌చంద్ర, ముజామిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల కాలపరిమితితో కళాశాల అభివృద్ధికి కమిటీ పని చేస్తుందని వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


మాట్లాడుతున్న నారాయణ్‌రావు

ముధోల్: మండలకేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగాఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్క సహకారంతో ఏడాదిలోనే రూ.80లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీలను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ ఎజా జోద్దీన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రావుల గంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు దుద్దు ప్రసాద్, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, పతంగి కిషన్, రావుల శ్రీనివాస్, అజీజ్, ఖాలీద్‌పటేల్, ఇమ్రాన్‌ఖాన్, షమీమ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన


కడెం: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కడెం: ఉద్యోగ భద్రత కల్పించి.. తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను విడుదల చేయాలని వేడుకున్నారు. జీపీ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, ఆయా గ్రామాల కార్మికులు ఉన్నారు.

భైంసారూరల్: తమకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని పంచాయతీల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది భూమారావుకు వినతిపత్రం ఇచ్చారు. కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని.. వేతనాల కోసం పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు గంగాధర్, అమృత్, లక్ష్మీకాంత్, మోహన్, నాగేశ్, ప్రకాశ్, ప్రసాద్, భోజారాం తదితరులు ఉన్నారు.

సోన్‌లో పీఏసీఎస్ ఏర్పాటుకు వినతి


వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సోన్: మండలకేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఏర్పాటు చేయాలని శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఏసీఎస్ ఏర్పాటు చేస్తే రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు, ఎరువులను అందుతాయని పేర్కొన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును తన నివాసలో కలిసి పీఏసీఎస్‌కు కృషి చేయాలని విన్నవించగా.. సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్‌రూరల్ మండలం మంజులాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బర్మా దాసు, మోహినుద్దీన్, కాంగ్రెస్ నాయకులు అంబేకర్ ప్రసాద్, టీచర్ లింగన్న, అజార్ తదితరులు ఉన్నారు.

హోటల్ వద్ద బదిలీ పంచాయితీ..!

- హెచ్‌ఎంకు ఉపాధ్యాయ సంఘం నేత బెదిరింపు
- వైరలైన సీసీ ఫుటేజీ వీడియో


హోటల్ వద్ద సీసీ టీవీలో నమోదైన దృశ్యం

భైంసాటౌన్: ఓ ఉపాధ్యాయుడి బదిలీ విషయమై ఓ ఉపాధ్యాయ సంఘం నేత ఏకంగా హోటల్ వద్దే బహిరంగ పంచాయితీ పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వం ఇటీవల అంతర్ జిల్లా బదిలీలకు అవకాశమిచ్చింది. దీంతో పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇచ్చోడలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలితో పరస్పర బదిలీ కోసం ఒప్పందం చేసుకున్నాడు. ఇందులో భాగంగా సర్వీస్ సర్టిఫికెట్‌పై సంతకం కోసం డీడీవో బాధ్యతలో ఉన్న మదీనాకాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంను సంప్రదించాడు. ధ్రువీకరణ పత్రం పరిశీలించిన హెచ్‌ఎం.. నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో డీఈవోతో స్పష్టత తీసుకుని సంతకం చేస్తానని చెప్పాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడు పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయ సంఘం నేతను ఆశ్రయించగా, గతనెల 30న రాత్రి ఓ హోటల్‌లో టీ తాగుతున్న హెచ్‌ఎం వద్దకు వెళ్లి సంతకం విషయమై బెదిరించినట్లు తెలిసింది. అంతేగాక, పట్టణంలోని సంఘ కార్యాలయానికి పిలిపించుకుని దుర్భాషలాడినట్లు సమాచారం. దీంతో హోటల్ వద్ద జరిగిన ఘటన సీసీ ఫుటేజీ వీడియో వైరల్‌గా మారింది. దీంతో ఉపాధ్యాయ సంఘం నేతపై పలువురు ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఉంటే కార్యాలయ పనివేళలు, కార్యాలయాల్లో చూసుకోవాల్సింది పోయి.. నడిబజారులో హోటల్ వద్ద రభస చేయాల్సిన అవసరమేముందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు సంఘం నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'ప్లాంట్ నిర్మాణం నిలిపివేయాలి'

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో అనుమతుల్లేకుండా చేపట్టిన వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు నిలిపివేయించాలని శుక్రవారం రాత్రి ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వీడీసీ సభ్యులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయం చేసుకుంటానని ఇటిక్యాల్ గ్రామంలో 1.09 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడన్నారు. అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాడని.. వీడీసీ ఆధ్వర్యంలో పనులు నిలిపివేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా వివిధ సంస్థల నుంచి అనుమతులు తెచ్చి పనులు చేస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో పర్యావరణానికి హాని కలుగడంతోపాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని విన్నవించారు. కార్యక్రమంలో ఇందులో ఇటిక్యాల్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు వినాయక్, షాబీర్‌ఖాన్, రాజు తదితరులు ఉన్నారు.

ఇళ్ల సర్వే పరిశీలన

తానూరు: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. శనివారం మండలంలోని జౌలా(బి) గ్రామంలో కొనసాగుతున్న సర్వేను శనివారం ఎంపీవో నసీరుద్దీన్ పరిశీలించారు. సర్వే వివరాలు తెలుసుకొని.. గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి మతిన్, తిరుపతి ఉన్నారు.